# ఆయన మనకు ప్రవక్తలను అనుగ్రహించాడు

ఏడవ పాఠము

## ప్రవచనముల యొక్క ఉద్దేశ్యము

Manuscript

thirdmill
Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.

# విషయ సూచిక


ఉపోద్ఘాతము ........ 1

దైవిక సార్వభౌమత్వము ........ 1

దేవుని నిర్వికారత ........ 2

దేవుని యొక్క స్వభావము ........ 2

నిబంధనా వాగ్దానములు ........ 2

శాశ్వతమైన యోచన ........ 3

దేవుని దైవకృతము ........ 4

ప్రవచనములు మరియు అనిశ్చితములు ........ 5

సాధారణ నమూనాలు ........ 6

పరిశీలన ........ 6

వివరణ ........ 6

విశదీకరణ ........ 7

నిర్దిష్ట ఉదాహరణలు ........ 8

షెమయా ప్రవచనము ........ 8

యోనా ప్రవచనము ........ 9

ప్రవచనముల యొక్క ధృవీకరణ ........ 10

షరతులతో కూడిన ప్రవచనములు ........ 11

షరతులు లేని ప్రవచనములు ........ 12

ధృవీకరించబడిన ప్రవచనములు ........ 13

పదాలు ........ 13

సూచనలు ........ 14

ప్రమాణపూర్వకమైన ప్రవచనములు ........ 14

ప్రవచనముల యొక్క లక్ష్యాలు ........ 16

సుప్రసిద్ధ దృక్కోణములు ........ 17

సరియైన దృక్కోణములు ........ 18

"ఎవరికి తెలుసు?" ప్రతిచర్య ........ 18

ద్వంద్వ ప్రతిచర్య ........ 20

ముగింపు ........ 20





వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# ఆయన మనకు ప్రవక్తలను అనుగ్రహించాడు

ఏడవ పాఠము

ప్రవచనముల యొక్క ఉద్దేశ్యము

## ఉపోద్ఘాతము

పాత నిబంధన ప్రవచన గ్రంథమును చదివేవారెవరైనా ప్రవక్తలు అనేక ప్రవచనములను చెప్పారని కనుగొంటారు, మరియు ప్రవచన గ్రంథములలో అనేకమైన ప్రవచనములు ఎందుకు ఉన్నాయని అనేకులను మనము అడిగినట్లైతే, వారు చాలా సులభంగా ఇలా చెబుతారు – భవిష్యత్తును గూర్చి మనకు తెలియపరచుటకు. ప్రథమంగా భవిష్యత్తును గూర్చి తెలియపరచుటకు ప్రవక్తలు తమ ప్రవచనములను మనకు ఇవ్వలేదుగాని, భవిష్యత్తును రూపొందించుకొను నిమిత్తము దేవుని ప్రజలను ప్రోత్సహించుటకు వారు ప్రవచించారు అని ఈ పాఠంలో మనము నేర్చుకొనబోతున్నాము.

ఈ పాఠమునకు మనము "ప్రవచనముల యొక్క ఉద్దేశ్యము" అను శీర్షికనిచ్చాము, ఎందుకంటే ప్రవక్తలు భవిష్యత్తును గూర్చి ఎందుకు మాట్లాడారు అను విషయమును మనం అన్వేషించబోతున్నాము. ప్రవచనముల యొక్క ఉద్దేశ్యమును కనుగొనుటకు, నాలుగు భిన్నమైన అంశములను మనం అన్వేషించబోతున్నాము: మొదటిగా, చరిత్ర మీద దైవిక సార్వభౌమత్వమును ప్రవక్తలు ఎలా అర్థం చేసుకున్నారు? రెండవదిగా, ప్రవక్తలు తమ ప్రవచనములను గూర్చి మరియు మానవ అనిశ్చితములను గూర్చి ఏమి నమ్మారు? మూడవదిగా, ప్రవక్తలు తమ ప్రవచనముల యొక్క వాస్తవికతలను ఎలా అర్థం చేసుకున్నారు? మరియు నాలుగవదిగా, పాత నిబంధన ప్రవచన గ్రంథములలో ప్రవచనముల యొక్క లక్ష్యములు ఏమిటి? చరిత్ర మీద దేవుడు కలిగినయున్న సార్వభౌమత్వము ప్రవక్తలకు తమ ప్రవచనముల యెడల ఉన్న అవగాహనను ఎలా రూపుదిద్దినదో మొదటిగా చూద్దాము.

## దైవిక సార్వభౌమత్వము

ఇతర ప్రజలందరివలెనే, క్రైస్తవులు కూడా, అతి తీవ్రతలలోనికి వెళ్లిపోవడం మీరెప్పుడైనా గమనించారా? అయితే అతిగా తినుట లేక తినకపోవుట, లేదా అతిగా వ్యాయామం చేయుట లేక వ్యాయామం చేయకపోవుట. సరే, వేదాంతశాస్త్రములో కూడా ఇలానే జరుగుతుంది. వేదాంతశాస్త్ర అంశములను గూర్చి మనం ఆలోచన చేయునప్పుడు చాలాసార్లు తీవ్రతలలోనికి వెళ్లిపోతూ ఉంటాము, మరియు దేవుని సార్వభౌమత్వము విషయంలో ఇలా మరి ఎక్కువగా చేస్తుంటాము. చరిత్ర మీద దేవుని సార్వభౌమత్వమును నొక్కి చెప్పే కొంతమంది క్రైస్తవులు మానవ బాధ్యత యొక్క వాస్తవికతను మినహాయించడం మనం చూస్తాము, మరియు మానవ ఎంపిక మరియు మానవ బాధ్యతను నొక్కి చెప్పే వారు దేవుని సార్వభౌమత్వమును తిరస్కరించడం మనం చూస్తాము. నేడు ఈ రకమైన భావనల మీద సంఘములో చాలా ఆందోళనలు ఉన్నాయి గనుక దేవుని సార్వభౌమత్వము మరియు మానవ బాధ్యతను గూర్చిన బైబిలు దృక్కోణమును పరిశీలించడానికి మనం కొంత సమయం గడపాలి. దేవుని



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి.

సార్వభౌమత్వమును గూర్చిన బైబిలు సిద్ధాంతము ప్రవక్తలు భవిష్యత్తును గూర్చి చేసిన ప్రవచనములను అర్థం చేసుకొనడానికి ముఖ్యమైన నేపథ్యమును అందిస్తుంది.

దేవుని సార్వభౌమత్వమును గూర్చి చర్చించడానికి అనేక మార్గములు ఉన్నాయి, అయితే రెండు సాంప్రదాయిక వేదాంతశాస్త్ర అంశములను మనం పరిశీలించబోతున్నాము: మొదటిగా, దేవుని నిర్వికారత; మరియు రెండవదిగా, దేవుని దైవకృతము. దైవిక నిర్వికారతమును గూర్చి బైబిలు ఏమి చెబుతుందో మొదటిగా చూద్దాము.

## దేవుని నిర్వికారత

సులభంగా చెప్పాలంటే, నిర్వికారతను గూర్చిన సిద్ధాంతము దేవుడు మారనివాడు అని బోధిస్తుంది. ఇప్పుడు, ఇలా మాట్లాడునప్పుడు మనము చాలా జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే మనం ఊహించే విధముగా దేవుడు నిర్వికారతముగా లేదా మారనివానిగా ఉండడు. అనేక శతాబ్దములుగా సాంప్రదాయ క్రమబద్ధ వేదాంతశాస్త్రము దేవుడు మారనివాడు అని చెప్పే నిర్దిష్ట మార్గములను గుర్తించుటలో జాగ్రత్త వహించింది. వాస్తవంగా చెప్పాలంటే, దేవుని నిర్వికారతను గూర్చి మాట్లాడడానికి మూడు ప్రధాన మార్గములు మాత్రమే ఉన్నాయి.

### దేవుని యొక్క స్వభావము

మొదటిగా, దేవుని స్వభావము మారనిది. దేవుడు ఎల్లప్పుడు ప్రేమామయుడు, ఎల్లప్పుడు న్యాయవంతుడు, ఎల్లప్పుడు అన్ని యెరిగినవాడు, ఎల్లప్పుడు సర్వశక్తివంతుడు, ఎల్లప్పుడు సర్వవ్యాపియై ఉన్నాడు. దేవుని లక్షణములు కాలమును బట్టి ఎన్నడును మారవు. హెబ్రీ 13:8లో హెబ్రీ పత్రిక రచయిత ఈ మాటలను వ్రాసినప్పుడు, అతడు ఇదే అర్థమును కలిగి ఉన్నాడు:

> యేసు క్రీస్తు నిన్న, నేడు, ఒక్కటేరీతిగా ఉన్నాడు (హెబ్రీయులకు 13:8).

దేవుడు ఆయనకు ఆయనగా కాకుండా వేరొక వ్యక్తిగా ఉండలేడు. ఆయన గుణములు నిర్వికారతలు గనుక ఆయన స్వభావము మారనిది అని మనం నమ్మవచ్చు.

### నిబంధనా వాగ్దానములు

దేవుడు ఆయన యొక్క స్వభావము లేదా గుణములకు మించి నిర్వికారతగా ఉన్నాడని చెప్పు మరొక కోణము ఉంది. ఆ నిర్వికారత ఆయన యొక్క నిబంధనా వాగ్దానములకు అనుసంధానముగా ఉంది. దేవుడు నిబంధనా వాగ్దానము చేసినప్పుడు, అది శాశ్వతముగా ఉంటుంది మరియు అది ఎన్నడు విచ్ఛిన్నం కాదు. మరోసారి, ఈ విషయమును గూర్చి లేఖనముల బోధనను హెబ్రీ పత్రిక రచయిత క్లుప్తంగా సంగ్రహించాడు. హెబ్రీ 6:16-17లో మనము ఈ మాటలు చదువుతాము:

> మనుష్యులు తమకంటె గొప్పవానితోడు అని ప్రమాణము చేతురు; వారి ప్రతి వివాదములోను వివాదాంశమును పరిష్కారము చేయునది ప్రమాణమే. ఈ విధముగా దేవుడు తన సంకల్పము నిశ్చలమైనదని ఆ వాగ్దానమునకు

> వారసులైనవారికి మరి నిశ్చయముగా కనుపరచవలెనని ఉద్దేశించినవాడై, తాను ... ప్రమాణము చేసి వాగ్దానమును దృఢపరచెను (హెబ్రీయులకు 6:16-17).

ఈ వాక్యభాగము స్పష్టము చేస్తున్నట్లుగా, దేవుడు నిబంధన ద్వారా వాగ్దానము చేసినప్పుడు, ఆయన చెప్పినదానిని చేయకుండా ఉండడు అని మనం నిశ్చయత కలిగియుండవచ్చు.

## శాశ్వతమైన యోచన

దేవుడు మారనివాడు అని లేఖనములు బోధించే మూడవ మార్గము ఆయన శాశ్వతమైన యోచన లేదా విశ్వము కొరకు ఆయన కలిగియుండిన శాశ్వతమైన ప్రణాళికకు సంబంధించినదిగా ఉంది. ఈ బోధనను లేఖనములో చూచు విషయములో కొన్ని క్రైస్తవ సమూహాలు విఫలమైనప్పటికీ, ఈ పాఠంలో మనము తెలియజేయు విషయములన్నీ దేవునికి మార్పులేని ప్రణాళిక ఉందని మరియు ఈ ప్రణాళిక చరిత్ర మొత్తాన్ని శాసిస్తుందనే నమ్మకము మీద నిర్మించబడ్డాయి. *వెస్ట్మి న్స్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* ను సంబోధిస్తూ ఈ సిద్ధాంతమును సాంప్రదాయ పద్ధతిలో సంగ్రహించుట సహాయకరముగా ఉంటుంది. *వెస్ట్మి న్స్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్*, 3వ అధ్యాయము, 1వ పేరాలో, దేవుని యొక్క శాశ్వతమైన ప్రణాళికను గూర్చి మనము ఈ మాటలను చదువుతాము:

> దేవుడు, నిత్యత్వములో, తన యొక్క చిత్త ప్రకారం, అత్యంత జ్ఞానయుక్తమైన మరియు పరిశుద్ధమైన ప్రణాళిక ద్వారా, స్వేచ్ఛగా, మరియు మార్పులేని విధముగా జరిగిన వాటినన్నిటిని నియమించాడు.

ఈ ఒప్పుకోలు ప్రకటన దేవుని యొక్క సార్వభౌమత్వమును స్పష్టమైన మార్గములో వ్యక్తపరుస్తుంది. సులభంగా చెప్పాలంటే, దేవుడు విశ్వము యెడల ఒక ప్రణాళిక కలిగియున్నాడు. అది సమగ్రమైనది, మరియు అది ఎన్నటికి విఫలము కాదు. అపొస్తలుడైన పౌలు దేవుని యొక్క ఈ ప్రణాళికను గూర్చి తన పత్రికలలో మాట్లాడాడు. ఉదాహరణకు, ఎఫెసీయులకు 1:12లో అతడు ఈ మాటలు వ్రాశాడు:

> ఆయన తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయముచొప్పున సమస్తకార్యములను జరిగించుచున్నాడు (ఎఫెసీయులకు 1:12).

అపొస్తలుని ఆలోచన ప్రకారము, దేవుని ప్రణాళికలో సమస్తము ఉన్నాయి, మరియు ఆ ప్రణాళిక ప్రకారము దేవుడు సమస్తమును జరిగించుచున్నాడు.

ప్రవక్తయైన యెషయా దేవుని యొక్క ఈ సమగ్రమైన ప్రణాళికను గూర్చి మాట్లాడాడు. యెషయా 46:9-11లో ప్రవక్త మాట్లాడిన ఈ మాటలను మనము చదువుతాము:

> దేవుడను నేనే మరి ఏ దేవుడును లేడు; నేను దేవుడను నన్ను పోలినవాడెవడును లేడు ... ఆదినుండి నేనే కలుగబోవువాటిని తెలియజేయుచున్నాను. పూర్వకాలమునుండి నేనే యింక జరుగనివాటిని తెలియజేయుచున్నాను ... "నా ఆలోచన నిలుచుననియు నా చిత్తమంతయు

నెరవేర్చుకొనెదననియు," నేను చెప్పియున్నాను దాని నెరవేర్చెదను ఉద్దేశించియున్నాను సఫలపరచెదను. (యెషయా 46:9-11, అక్షరార్థంగా).

దేవుని నిర్వికారతను గూర్చిన బైబిలు సిద్ధాంతమును ప్రవక్తలు విశ్వసించారు అని అర్థం చేసుకొనుట చాలా ప్రాముఖ్యమైన విషయముగా ఉంది. దేవుడు తన యొక్క స్వభావములోనూ, తన యొక్క నిబంధనా వాగ్దానములలోనూ మరియు విశ్వము యెడల ఆయన కలిగియున్న తన శాశ్వతమైన ప్రణాళికలోనూ మార్పులేనివానిగా ఉన్నాడు. కాబట్టి ఇశ్రాయేలు చరిత్రలో ఏమి జరిగిననూ, దేవుడు ఎల్లప్పుడు తన స్వభావములో నిజాయితిగా ఉంటాడు అని ప్రవక్తలు అర్థం చేసుకున్నారు. ఆయన ఎల్లప్పుడు తన వాగ్దానములను స్థిరపరుస్తాడని వారు అర్థం చేసుకున్నారు, మరియు దేవుని యోచన మరియు సమస్తము మీద ఆయన కలిగియున్న నియంత్రణ ఎన్నటికి విఫలము కావు అని కుడా వారు తెలుసుకున్నారు. మనము ప్రవచన గ్రంథములను చదివినప్పుడు, అనేకసార్లు భయంకరమైన సంఘటనలు జరగడం మనం గమనిస్తాము, అయితే దేవుని నిర్వికారత యెడల వారు కలిగియున్న ఈ నిశ్చయత వారిని నిలబెట్టింది.

దేవుని నిర్వికారత ప్రవక్తల యొక్క ప్రవచనములన్నిటికి నేపథ్యమును ఏర్పరుస్తుంది అని మనం చూశాము గనుక, దీనిలోని మరొక వైపును కూడా మనం జ్ఞాపకం చేసుకోవాలి. దేవుని నిర్వికారత అను సిద్ధాంతము దేవుని దైవకృతము అను సిద్ధాంతముతో సమతుల్యము కలిగి ఉండాలి.

## దేవుని దైవకృతము

విశ్వము పట్ల తాను కలిగియున్న శాశ్వతమైన ప్రణాళికను జరిగిస్తున్నప్పుడు చరిత్రలో దేవుడు క్రియాత్మకముగా పాలుపంచుకొనుటను దేవుని దైవకృతము అని నిర్వహించవచ్చును. లేఖనముల ప్రకారం, దేవుడు తన యొక్క నిర్వికారత ప్రణాళిక నెరవేర్చబడుటను చూస్తూ తన సృష్టి నుండి తననుతాను దూరము చేసుకోడు. బదులుగా, తన యొక్క శాశ్వత ప్రణాళికలో ఆయన తన పాత్రను పోషించువానిగా ఉన్నాడు. ఇందుమూలముగానే బైబిలు ఎల్లప్పుడు దేవునిని గూర్చి సజీవుడైన దేవుడు అని మాట్లాడుతుంది. చరిత్ర అనే వేదిక మీద ఆయన నటుడుగా ఉన్నాడు మరియు దైవకృతములో తన సృష్టితో ఎల్లప్పుడు పాలుపంచుకుంటాడు గనున ఆయన సజీవుడై ఉన్నాడు. మరోసారి, ఈ విషయాలను స్పష్టంగా అర్థం చేసుకొనుటకు *వెస్ట్మిన్స్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* మనకు సహాయపడుతుంది. 5వ అధ్యాయము, 2వ పేరాలో దేవుని దైవకృతమును గూర్చిన ఈ మాటలను మనము చదువుతాము:

> మొదటి కారకమైన దేవుని యొక్క ఆజ్ఞలు మరియు పూర్వజ్ఞానమునకు అనుబంధములో, సమస్త విషయములు నిర్వికారతతోను మరియు పరిపూర్ణంగాను కలుగుతాయి; అయితే, అదే దైవకృతము ద్వారా, రెండవ కారకముల యొక్క స్వభావము ప్రకారము, తప్పనిసరిగా, స్వేచ్ఛగా లేక ఆకస్మికంగా అవి జరుగునట్లు ఆయన వాటిని నిర్దేశిస్తాడు.

మొదటిగా, దేవుని ప్రణాళిక విఫలం కాకుండా, నిర్వికారతగా మరియు పరిపూర్ణంగా నెరవేర్చబడుతుంది అని శాశ్వత దృక్కోణములో నుండి ఇక్కడ మనం చూస్తాము. అయితే చారిత్రిక,

దైవకృత దృష్టి కోణంలో, దేవుడు తన సృష్టిలో వివిధ మార్గములలో పాలుపంచుకొనుట ద్వారా తన శాశ్వత ప్రణాళికను జరిగిస్తాడు అని కూడా మనం చూస్తాము. ఆయన రెండవ కారకములు, లేదా సృష్టి కారకములతో కనీసం మూడు మార్గములలో సంకర్షిస్తాడు. విషయములను క్రమపరచుట ద్వారా దేవుడు తన ప్రణాళికను జరిగిస్తాడు, తద్వారా అవి ఒకదానినొకటి తప్పనిసరిగా, స్వేచ్ఛగా, లేదా అనిశ్చితముగా అనుసరిస్తాయి. ఈ వ్యత్యాసములు ముఖ్యమైనవి, కాబట్టి వీటిని మరి కొంత వివరిద్దాము.

కొన్నిసార్లు దేవుని దైవకృతము విషయాలను తప్పనిసరిగా జరిగించుటకు కారణమౌతుంది. ప్రకృతి యొక్క సాధారణ నియమములు అనగా గురుత్వాకర్షణ నియమము వంటి నియమముల ప్రకారం జరిగే విషయములు ఇక్కడ మన మనస్సులో ఉన్నాయి. ప్రకృతి నియమములు దైవకృతము యొక్క ప్రవచన మరియు తప్పనిసరి పద్ధతులను అందిస్తాయి, అయితే అదే సమయంలో, కొన్ని విషయాలు స్వేచ్ఛగా జరుగుతాయని *కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* చెబుతుంది. మరోమాటలో, అవి మానవ కోణం నుండి యాదృచ్ఛికముగా కనిపిస్తాయి. పాచికలను వేయుట, వాతావరణ పద్ధతులు, మరియు జీవితములో ఇలాంటి ఇతర విషయములు దేవుని నియంత్రణలో ఉంటాయి, అయితే అవి మానవ కోణం నుండి, యాదృచ్ఛికముగా లేదా స్వేచ్ఛగా సంబంధం కలిగియున్నట్లు కనిపిస్తాయి. చివరిగా, చరిత్రలో కొన్ని విషయాలు అనిశ్చితంగా జరుగుతాయని *కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* మనకు చెబుతుంది. వాస్తవంగా చెప్పాలంటే, దేవుడు ఎల్లప్పుడు వీటన్నిటి మీద నియంత్రణ కలిగియున్నాడు, కాని మానవ ఎంపిక యొక్క అనిశ్చితత్వముతో సంకర్షించుట ద్వారా ఈ విషయములలో చరిత్ర యొక్క దిశను ఆయన నియంత్రించాడు.

ప్రవక్తలు దేవుని ప్రణాళిక విఫలం కాకుండా ఖచ్చితంగా నెరవేర్చబడుతుందని నమ్మడం మాత్రమే కాకుండా, దేవుని ప్రణాళికలో మానవుని ఎంపిక మరియు మానవుని స్పందన కూడా ఉంటాయని నమ్మారు. ప్రవచన పరిచర్యలో ఈ వాస్తవము కేంద్ర పాత్రను పోషించింది గనుక దీనిని మనం జాగ్రత్తగా పరిశీలించాలి. దైవ నిర్వికారత మరియు దైవకృతము యొక్క నేపథ్యమును దృష్టిలో ఉంచుకొని, మనము మన యొక్క రెండవ అంశమును చూద్దాము: ప్రవచనములు మరియు అనిశ్చితములు.

## ప్రవచనములు మరియు అనిశ్చితములు

ఇప్పటివరకు, దేవుడు తన ప్రణాళికను కొన్నిసార్లు మానవుని ఎంపిక యొక్క అనిశ్చితముల ద్వారా జరిగిస్తాడు అని మనం చూశాము. ఈ సమయంలో, ఈ మానవుని అనిశ్చితముల రకములు పాత నిబంధన ప్రవచన గ్రంథములలోని ప్రవచనముల మీద ముఖ్యమైన ప్రభావమును కలిగియున్నాయి అని మనము చూడబోతున్నాము. ప్రవచనముకు మరియు ఆ ప్రవచన నేరవేర్పుకు మధ్య మానవుని ఎంపిక యొక్క జోక్యము చరిత్ర ఫలితము మీద గణనీయమైన ప్రభావమును చూపుతుంది. ప్రవచనములు మరియు అనిశ్చితములకు మధ్య సంబంధమును గూర్చి వివరించాలంటే, మనము రెండు అంశములను దృష్టించాలి: మొదటిగా, మనము ఆశించాలని బైబిలు బోధించే సాధారణ నమూనాలు; మరియు రెండవదిగా, ఈ క్రియాశీలత యొక్క కొన్ని నిర్దిష్ట ఉదాహరణలు.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

## సాధారణ నమూనాలు

ప్రవచనములు మరియు చారిత్రిక అనిశ్చితములను కలిగియున్న సాధారణ లేక ప్రధాన నమూనాను మొదటిగా చూద్దాము. ఈ సాధారణ నమూనాను చూచుటలో మనకు సహాయపడే ఉత్తమమైన వాక్యభాగము యిర్మీయా 18:1-10. ఈ వాక్యభాగము చాలా ప్రాముఖ్యమైనది గనుక మనము దీనిని జాగ్రత్తగా పరిశీలించాలి. ఈ వాక్యభాగములోని మూడు కోణములను మనము చూద్దాము: మొదటిగా, 18:1-4లో యిర్మీయా యొక్క పరిశీలన; రెండవదిగా, 5 మరియు 6 వచనములలో దేవుని యొక్క వివరణ; మరియు మూడవదిగా, 7 నుండి 10 వచనములలో దేవుని విశదీకరణ.

### పరిశీలన

1 నుండి 4 వచనములలో యిర్మీయా చేసిన పరిశీలనను వినండి:

> యెహోవా యొద్ద నుండి యిర్మీయాకు ప్రత్యక్షమైన వాక్కు "నీవు లేచి కుమ్మరి యింటికి పొమ్ము, అక్కడ నా మాటలు నీకు తెలియజేతును." నేను కుమ్మరి యింటికి వెళ్లగా వాడు తన సారెమీద పని చేయుచుండెను. కుమ్మరి జిగటమంటితో చేయుచున్న కుండ వాని చేతిలో విడిపోగా ఆ జిగటమన్ను మరల తీసికొని కుమ్మరి తనకు యుక్తమైనట్టుగా దానితో మరియొక కుండ చేసెను (యిర్మీయా 18:1-4).

కుమ్మరి ఇంటికి వెళ్లమని దేవుడు యిర్మీయాకు చెప్పాడు. యిర్మీయా కుమ్మరి ఇంటికి వెళ్లి, అక్కడ కుమ్మరి జిగటి మట్టితో ఒక కుండను తయారుచేయడం మరియు జిగటిమట్టి విడిపోయినప్పుడు దానిని మరియొక విధముగా రూపొందించుటను చూశాడు. కుమ్మరి జిగటిమట్టి ముద్దను తీసుకొని, తనకు యుక్తమైన విధముగా దానిని రూపొందించాడు. కుమ్మరి యింటిలో యిర్మీయా చేసిన పరిశీలనలో ఒక ముఖ్యమైన చిహ్నాత్మక విలువ ఉంది, దానిని యిర్మీయా చూడాలని దేవుడు ఆశించాడు. కాబట్టి, 5 మరియు 6 వచనములలో ఈ అనుభవము యొక్క ప్రాముఖ్యతను దేవుడు యిర్మీయాకు చెప్పాడు.

> అంతట యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను: "ఇశ్రాయేలువారలారా, ఈ కుమ్మరి మంటికి చేసినట్లు నేను మీకు చేయలేనా?" యిదే యెహోవా వాక్కు "జిగటమన్ను కుమ్మరిచేతిలో ఉన్నట్టుగా ఇశ్రాయేలువారలారా, మీరు నా చేతిలో ఉన్నారు" (యిర్మీయా 18:5-6).

### వివరణ

బైబిలులోని ఈ భాగం చాలామంది ఊహించునట్లుగానే వ్యాఖ్యానించబడుతుంది; కుమ్మరి యెహోవాను సూచిస్తున్నాడు మరియు జిగటిమంటి ఇశ్రాయేలును సూచిస్తుంది. ఈ వాక్యభాగము స్పష్టము చేస్తున్నట్లుగానే, కుమ్మరి జిగటిమంటితో వ్యవహరిస్తున్న రీతిగానే దేవుడు తన ప్రజలను తన యుక్తమైన విధముగా మలచుకొనే హక్కును కలిగి ఉన్నాడు. వాస్తవంగా చెప్పాలంటే, మనము చూచినట్లుగా, దేవుడు తన యొక్క నిర్వికారత స్వభావమును, లేదా ఆయన నిబంధనలను, లేదా

ఆయన యొక్క శాశ్వతమైన ప్రణాళికను ఉల్లంఘించడు. అయితే, ఈ పరిమితులలో, దేవుడు తన ప్రజలతో వ్యవహరించే విషయంలో భిన్నంగా ఉండుటకు స్వతంత్రుడై ఉన్నాడు.

### విశదీకరణ

కుమ్మరిని పరిశీలించుటను మరియు దేవుని యొక్క వివరణను మనస్సులో ఉంచుకొని, ఈ సంఘటనను దేవుడు ఎలా విశదీకరించాడో చూచే స్థితిలో మనం ఉన్నాము. ఒక మాటలో చెప్పాలంటే, కుమ్మరి మరియు కుండ అను ఈ చిత్రీకరణను దేవుడు ప్రవచనాత్మక వ్యక్తీకరణకు అనుసంధానించాడు. మొదటిగా, 7 మరియు 8 వచనములలో, దేవుడు తీర్పును గూర్చిన ప్రవచనములను ప్రస్తావించాడు.

> దాని పెల్లగింతుననియు, విరుగగొట్టుదుననియు, నశింపజేయుదుననియు ఏదోయొక జనమును గూర్చి గాని రాజ్యమునుగూర్చి గాని నేను చెప్పియుండగా ఏ జనమునుగూర్చి నేను చెప్పితినో ఆ జనము చెడుతనముచేయుట మానినయెడల నేను వారికి చేయ నుద్దేశించిన కీడును గూర్చి సంతాపపడుదును (యిర్మీయా 18:7-8).

దేవుడు పరిస్థితిని గూర్చి వివరించిన విధానమును గమనించండి. ఏ సమయములోనైనా, ఏ రాజ్యము మీదికైనా, తీర్పును ప్రకటించగలను అని ఆయన చెప్పాడు. అయినను, పశ్చాత్తాపము అను చారిత్రిక అనిశ్చితము జరిగితే, అప్పుడు దేవుడు దయచూపిస్తాడు. ప్రవచించబడిన విధముగా నెరవేర్పు జరగకపోవచ్చు. ఒక మాటలో చెప్పాలంటే, మానవ ఎంపిక యొక్క చారిత్రిక అనిశ్చితము తీర్పును గూర్చిన ప్రవచనమును దేవుడు నెరవేర్చు విధానంలో పెద్ద తేడాను కలిగిస్తుంది.

ఈ సూత్రము ఇతర రకమైన ప్రవచనములకు కూడా వర్తిస్తుందని చూపించుటకు, 9 మరియు 10 వచనములలో దేవుడు ఆశీర్వాద ప్రవచనములను గూర్చి మాట్లాడాడు:

> మరియు కట్టెదననియు, నాటెదననియు ఒక జనమును గూర్చి గాని రాజ్యమునుగూర్చి గాని నేను చెప్పియుండగా ఆ జనము నా మాట వినకుండ నా దృష్టికి కీడుచేసినయెడల దానికి చేయదలచిన మేలునుగూర్చి నేను సంతాపపడుదును (యిర్మీయా 18:9-10).

సమాంతర పరిస్థితిని గమనించండి. ఏ సమయములోనైనా, ఏ రాజ్యమును గూర్చియైనా, భద్రత మరియు శ్రేయస్సు అను ఆశీర్వాదములను గూర్చి ఆయన ప్రకటించగలడు; అయితే తిరుగుబాటు మరియు అవిధేయత అను చారిత్రిక అనిశ్చితములు జరిగితే, తత్ఫలితంగా దేవుడు తాను ఉద్దేశించిన మేలును చేయడు.

మనం ప్రతి బైబిలు ప్రవచనమునకు అనువర్తించగల ఒక సూత్రమును యిర్మీయా 18 మనకు బోధిస్తుంది. తీర్పు మరియు ఆశీర్వాదముల యెడల మానవులు స్పందించే విధానమును ఆధారము చేసుకొని ప్రతిస్పందించడానికి తాను స్వతంత్రుడైయున్నాడు అని దేవుడు యిర్మీయాకు చెప్పాడు. బైబిలు ప్రవచనమును మనము పరిశీలించుచుండగా, ప్రజలు ప్రవచన మాటలకు ఎలా స్పందించారో దేవుడు ఎల్లప్పుడు గమనించి, దానిని బట్టి తమ భవిష్యత్తుకు ఏమి చేయాలో నిర్ణయించాడు అని మనం చూస్తాము.

## నిర్దిష్ట ఉదాహరణలు

ఇప్పుడు ప్రవచనములు మరియు అనిశ్చితములు యొక్క సాధారణ సూత్రమును మనము చూశాము గనుక, ఈ సూత్రము ఏ విధముగా పనిచేస్తుందో కొన్ని ఉదాహరణలను చూడడానికి ఇది సహాయపడుతుంది. ప్రవచనముల నెరవేర్పులో మానవ ఎంపిక యొక్క అనిశ్చితము కలిగించిన పెద్ద తేడాను గూర్చి బైబిలులో లెక్కలేనన్ని ఉదాహరణలు ఉన్నాయి. ఈ క్రియాశీలకము కనిపించే రెండు ఉదాహరణలను మాత్రం మనం చూద్దాము: మొదటిగా, ప్రవక్తయైన షెమయా చెప్పిన ప్రవచనము, తదుపరి యోనా ప్రవచనము.

### షెమయా ప్రవచనము

మొదటిగా షెమయా ప్రవక్త యొక్క ప్రవచనమును చూద్దాము. 2 దినవృత్తాంతములు 12:5లో, తీర్పును గూర్చి షెమయా ప్రవక్త పలికిన మాటలను మనం చదువుతాము:

> ప్రవక్తయైన షెమయా రెహబామునొద్దకును, షీషకునకును భయపడి యెరూషలేమునకు వచ్చి కూడియున్న యూదావారి అధిపతుల యొద్దకును వచ్చి, "మీరు నన్ను విసర్జించితిరి గనుక నేను మిమ్మును షీషకు చేతిలో పడనిచ్చియున్నానని యెహోవా సెలవిచ్చుచున్నాడని చెప్పెను" (దినవృత్తాంతములు 12:5).

ఈ ప్రవచనములో షెమయా ఎటువంటి స్పష్టమైన షరతులను ఇవ్వలేదని గమనించండి. ప్రవక్తల యొక్క పరిచర్యలను గూర్చి అవగాహన లేనివారికి, షెమయా దేవుని యొక్క శాశ్వతమైన, మారని ఆజ్ఞను వెల్లడించినట్లు అనిపిస్తుంది. అయితే రెహబాము మరియు యూదా నాయకులకు దీనిని గూర్చి తెలుసు. ఈ మాటలు కేవలము దేవుని నుండి వచ్చిన హెచ్చరిక మాత్రమే అయ్యున్నవని, వారు పశ్చాత్తాపపడకపోతే దేవుడు అనుకున్నది చేస్తాడని హెచ్చరించు హెచ్చరిక మాత్రమే అయ్యున్నదని వారు ఆశించారు. కాబట్టి 12:6లో మనము ఈ మాటలు చదువుతాము:

> అప్పుడు ఇశ్రాయేలీయుల అధిపతులును రాజును తమ్మును తాము తగ్గించుకొని యెహోవా న్యాయస్థుడని ఒప్పుకొనిరి (2 దినవృత్తాంతములు 12:6).

రెహబాము మరియు ఇశ్రాయేలీయుల అధిపతులు తీర్పును గూర్చిన ప్రవచనమును వినినప్పుడు, వారికి ఏమి చేయాలో తెలుసు. వారు పశ్చాత్తాపముతోను మరియు విశ్వాసముతోను దేవునికి మొరపెట్టుచూ, ఆయన కనికరము కొరకు కనిపెట్టవలసియుండెను.

మనము ఈ వాక్యభాగమును చదువుట కొనసాగించుచుండగా, విధేయతతో కూడిన ప్రార్థన అను చారిత్రిక అనిశ్చితము షెమయా యొక్క ప్రవచనము మీద నాటకీయమైన ప్రభావమును చూపుతుంది. వాస్తవంగా చెప్పాలంటే, షెమయా స్వయంగా ఈ ప్రభావమును గుర్తించాడు. యూదా అధిపతులు పశ్చాత్తాపపడిన తరువాత అతడు ఏమి చెప్పాడో వినండి. 7 మరియు 8 వచనములలో మనము ఈ మాటలు చదువుతాము:



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

> వారు తమ్మును తాము తగ్గించుకొనుట యెహోవా చూచెను గనుక యెహోవా వాక్కు షెమయాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను: "వారు తమ్మును తాము తగ్గించుకొనిరి గనుక నేను వారిని నాశనముచేయక, షీషకు ద్వారా నా ఉగ్రతను యెరూషలేము మీద కుమ్మరింపక త్వరలోనే వారికి రక్షణ దయచేసెదను. అయితే నన్ను సేవించుటకును, భూరాజులకు దాసులై యుండుటకును ఎంత భేదమున్నదో వారు తెలిసికొనునట్లు వారు అతనికి దాసులగుదురు" (2 దినవృత్తాంతములు 12:7-8).

షెమయా యొక్క పరిచర్య నేటి ప్రసంగీకుల వలె ఉన్నదని ఈ వాక్యభాగము స్పష్టం చేస్తుంది. ప్రజలను శాశ్వతముగా నాశనము చేయుటకు కాదుగాని ప్రజలు ఈ హెచ్చరికను విని, మారుమనస్సు పొంది, దేవుని కృప పొందుకొంటారు అను ఉద్దేశ్యముతో తీర్పు రాబోవుచున్నదని అతడు హెచ్చరించాడు. కాబట్టి మానవుని యొక్క ప్రార్థనా ప్రతిస్పందన షెమయ ప్రవచనము నెరవేర్చబడే విధానములో గణనీయమైన వ్యత్యాసమును చూపింది. ఈ సందర్భములో, షెమయా ప్రవచనము పరిపూర్ణంగా తారుమారు కాలేదు కాని అది మృదువు చేయబడింది లేదా సున్నితము చేయబడింది, తద్వారా యెరూషలేము మీద జరిగిన దాడి అనుకున్నంత తీవ్రంగా లేకపోయింది.

### యోనా ప్రవచనము

ప్రవచనము యెడల మానవుని ప్రతిస్పందన యొక్క ప్రభావమును గూర్చిన రెండవ ఉదాహరణ యోనా గ్రంథములో కనిపిస్తుంది. యోనా కథ మనందరికీ సుపరిచమైనది. రాబోవు తీర్పును ప్రకటించడానికి దేవుడు యోనాను నీనెవె పట్టణమునకు పంపాడని మనకు తెలుసు. యోనా 3:4లో యోనా ఇలా చెప్పాడు:

> ఇక నలువది దినములకు నీనెవె పట్టణము నాశనమగును (యోనా 3:4).

ఈ ప్రవచనము కంటే సులభమైనది ఏముంటుంది? నీనెవె పట్టణము నాశనము కావడానికి ఇంకా నలభై రోజులు మాత్రమే ఉందని యోనా ప్రకటించాడు. "ఒకవేళ," "మరియు," లేదా "కాని" అనే మాటలే లేవు. అయితే ఏమి జరిగింది? ఏమి జరిగిందో మిగిలిన అధ్యాయము చెబుతుంది. నీనెవె రాజు, ప్రజలు మరియు తమ జంతువులు అన్నియు గోనె పట్టా కట్టుకొని బూడిదలో కూర్చొని పశ్చాత్తాపపడ్డారు. 3:7-9లో రాజు ఇలా ప్రకటించాడు:

> ఒకవేళ దేవుడు మనస్సు త్రిప్పుకొని పశ్చాత్తప్తుడై మనము లయముకాకుండ తన కోపాగ్ని చల్లార్చుకొనును గనుక మనుష్యులు ఏదియు పుచ్చుకొనకూడదు, పశువులు గాని యెద్దులుగాని గొఱ్ఱలుగాని మేత మేయకూడదు, నీళ్లు త్రాగకూడదు, మనుష్యు లందరు తమ దుర్మార్గములను విడిచి తాము చేయు బలాత్కారమును మానివేయవలెను, మనుష్యులేమి పశువులేమి సమస్తమును గోనెపట్ట కట్టుకొనవలెను, జనులు మనఃపూర్వకముగా దేవుని వేడుకొనవలెను అని దూతలు నీనెవె పట్టణములో చాటించి ప్రకటన చేసిరి (యోనా 3:7-9).

సులభంగా చెప్పాలంటే, పశ్చాత్తాపము అను చారిత్రిక అనిశ్చిత జోక్యము ప్రవచనము నేరవేరబడకముందే జరిగింది. ప్రజలు తమ్మునుతాము దేవుని యెదుట తగ్గించుకొని పశ్చాత్తాపపడ్డారు. మరియు చారిత్రిక అనిశ్చితము యొక్క ఫలితము ఏమిటి? 3:10లో మనము ఈ మాటలను చదువుతాము:

> **ఈ నీనెవెవారు తమ చెడు నడతలను మానుకొనగా వారు చేయుచున్న క్రియలను దేవుడు చూచి పశ్చాత్తప్తుడై వారికి చేయుదునని తాను మాట యిచ్చిన కీడుచేయక మానెను (యోనా 3:10).**

యోనా ప్రవచనము యొక్క నెరవేర్పు నీనెవె పట్టణస్థుల యొక్క పశ్చాత్తాపము ద్వారా బహుగా ప్రభావితం అయ్యింది. 4:2లో అతడు తరువాత ఈ విధంగా దేవునికి ఫిర్యాదు చేశాడు:

> **అందువలననే నీవు కటాక్షమును జాలియును బహు శాంతమును అత్యంత కృపయుగల దేవుడవై యుండి, పశ్చాత్తాపపడి కీడుచేయక మానుదువని నేను తెలిసికొన్నాను (యోనా 4:2).**

అతడు ఈ ప్రవచనమును ఇచ్చినప్పటికీ కూడా, దేవుడు పట్టణమును నాశనము చేయడు అని యోనాకు తెలుసు. వాస్తవంగా చెప్పాలంటే, నూరు సంవత్సరముల తరువాత మాత్రమే నీనెవె పట్టణము బబులోనీయుల చేతిలో నాశనము చేయబడింది.

యిర్మీయా 18 యొక్క సాధారణ సూత్రము నుండి మరియు ఈ రెండు నిర్దిష్ట ఉదాహరణముల నుండి, మానవ ఎంపిక యొక్క అనిశ్చితము ప్రవచనములు నెరవేర్చబడు విధానముల మీద అనేకమార్లు ప్రభావం చూపింది అని మనం చూస్తాము. దేవుడు కొన్నిసార్లు తీర్పును లేదా ఆశీర్వాదమును తలక్రిందులు చేస్తాడు; కొన్నిసార్లు ఆశీర్వాదమును సున్నితము చేస్తాడు లేదా తీర్పును తగ్గిస్తాడు; మరియు ఇంకొన్నిసార్లు ప్రవచనము యెడల మానవుల యొక్క స్పందనను బట్టి తీర్పులను లేదా ఆశీర్వాదములను ఎక్కువ చేస్తాడు.

చారిత్రిక అనిశ్చితములు ప్రవచన నేరవేర్పులను ప్రభావితం చేస్తాయి అని మనము ఇప్పటి వరకు చూశాము గనుక, ఇప్పుడు రెండవ అంశమును చూద్దాము. పాత నిబంధన విశ్వాసులు ఒక ప్రవచనమును గూర్చి వినినప్పుడు వారు ఎటువంటి నిశ్చయత లేదా విశ్వాసము కలిగియుండేవారు? ప్రవక్తలు చెప్పిన ప్రవచనములను దేవుడు నేరవేర్చుతాడు అని వారు ఎంత నమ్మకంగా ఉండేవారు?

## ప్రవచనముల యొక్క ధృవీకరణ

ఈ ప్రశ్నకు సమాధానం ఇచ్చుటకు పాత నిబంధన ప్రవచన గ్రంథములలో మనము కనుగొనే ప్రవచనములను సమీక్షించుట సహాయకరంగా ఉంటుంది. మునుపటి పాఠములలో మనము చూచినట్లుగా, పాత నిబంధన ప్రవచనములను మనము అమర్చగల ఒక అక్షం నిబంధనా ఆశీర్వాదములు మరియు తీర్పుల మధ్య వ్యాత్యాసము అయ్యున్నది. ప్రవచనాత్మక ప్రవచనములను

ప్రకృతి మరియు యుద్ధము ద్వారా దేవుని ఆశీర్వాదములుగాను మరియు ప్రకృతి మరియు యుద్ధము ద్వారా ఆయన తీర్పులుగాను వర్గీకరించవచ్చును. మునుపటి పాఠంలో కూడా మనము మరొక అమర్చబడిన అక్షాన్ని చూశాము. ప్రవచనాత్మకమైన ప్రవచనములన్ని గొప్ప మరియు తక్కువ తీర్పులు మరియు ఆశీర్వాదముల పరిధిలో ఉంటాయి. ప్రవక్తలు అనేక రకములైన కొద్దిపాటి ఆశీర్వాదములు మరియు తీర్పులను ప్రకటించినట్లుగా మీరు జ్ఞాపకం చేసుకుంటారు, అయితే గొప్ప తీర్పు చెరగాను మరియు గొప్ప ఆశీర్వాదము చెర నుండి విమోచనగాను ఉన్నాయి. ప్రవచనాత్మక ప్రవచనములను గూర్చిన ఈ ప్రాథమిక విధానం ప్రవక్తలు తమ వాస్తవిక శ్రోతలకు ఇచ్చిన ప్రాథమిక సందేశమును చూడడానికి మనకు సహాయపడుతుంది.

అయితే, ఈ సమయంలో, మన ప్రవచనాత్మక ప్రవచనముల యొక్క అమరికకు మనము మూడవ కోణమును జతపరచాలి. పాత నిబంధన ప్రవక్తలు తమ శ్రోతలకు ఎక్కువ లేదా తక్కువ ఆశీర్వాదములు మరియు తీర్పులను గూర్చి చెప్పడము మాత్రమే గాక, ఒక విధంగా లేదా మరొక విధంగా, ఈ తీర్పులను కొనసాగించడానికి దేవుడు కలిగియుండిన సంకల్పము యొక్క స్థాయిని కూడా వారు సూచించారు. వర్ణపటము యొక్క ఒకవైపున, ఒక నిర్దిష్టమైన విషయమును నెరవేర్చుటకు దేవునికి చాలా తక్కువ స్థాయి సంకల్పం ఉందని ప్రవక్తలు తమ శ్రోతలకు చెప్పారు. వర్ణపటము యొక్క మరొకవైపున, ప్రవచనములను నెరవేర్చుటకు దేవుడు ఉన్నతమైన సంకల్పమును కలిగియున్నాడని వారు సూచించారు. ప్రవచనమును నెరవేర్చుటకు దేవుడు ఎక్కువ లేదా తక్కువ సంకల్పం కలిగియున్నాడని ప్రవక్తలు మాట్లాడినప్పుడు, వారు ఆయనను గూర్చి మానవరీత్యా మాట్లాడుతున్నారు అని జ్ఞాపకముంచుకోవడం చాలా ప్రాముఖ్యమైయున్నది. దేవుని శాశ్వతమైన, మారని ప్రణాళిక ప్రకారం, ఆయన తాను కోరుకున్నదంతా ఎల్లప్పుడు నెరవేర్చుతాడు. అయితే దేవుడు మానవ సృష్టితో మాట్లాడుతున్నప్పుడు మరియు ఆయన ప్రణాళికను దైవకృతములో కొనసాగించినప్పుడు, కొన్నిసార్లు ఆయన యొక్క సంకల్పం చాలా అధికముగా ఉన్నట్లు ఆయన బయలుపరచాడు, మరియు మరికొన్నిసార్లు, ఆయన సంకల్పం చాలా అల్పముగా ఉందని బయలుపరచాడు.

## షరతులతో కూడిన ప్రవచనములు

పాత నిబంధన ప్రవచనముల యొక్క ఈ కోణమును చూచుటకు అనేక మార్గములు ఉన్నాయి, అయితే మనము దేవుని సంకల్పం యొక్క వర్ణపటములో నాలుగు వేర్వేరు బిందువులను చూద్దాము. మొదటిగా, దేవుడు చరిత్రను ఒక దిశలో లేదా మరొక దిశలో ప్రయాణించునట్లు నిర్ధారించలేదని వెల్లడిపరచు అనేక ప్రవచనములను ప్రవక్తలు ప్రవచించారు. వారు నిర్దిష్టమైన షరతులతో తమ ప్రవచనములను అర్థమైనవిగా ఎంచుట ద్వారా ఇలా చేశారు. పాత నిబంధన ప్రవచన గ్రంథములలో "యెడల....అప్పుడు" అను ప్రకటనల రూపములో ఉన్న నిర్దిష్టమైన షరతులు అనేకసార్లు కనిపిస్తాయి. ఉదాహరణకు, యెషయా 1:19-20లో షరతులతో కూడిన ఈ ప్రవచనమును మనం చదువుతాము:

> మీరు సమ్మతించి నా మాట వినినయెడల మీరు భూమి యొక్క మంచి పదార్థములను అనుభవింతురు. సమ్మతింపక తిరుగబడినయెడల నిశ్చయముగా మీరు ఖడ్గము పాలగుదురు యెహోవా యీలాగుననే సెలవిచ్చియున్నాడు (యెషయా 1:19-20).



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

ఈ వాక్యభాగములో, దేవుని ప్రజలకు ఎంపిక ఉందని ప్రవక్తయైన యెషయా స్పష్టముగా చెప్పాడు. వారు యెహోవాకు లోబడిన యెడల, వారు ఆశీర్వదించబడతారు, వారు లోబడని యెడల, తీర్పును పొందుతారు. అనేకసార్లు, చరిత్ర ప్రయాణించు దిశపట్ల దేవుడు ఇంకను బాహాటముగా ఉన్నాడని ప్రజలకు తెలియజేయుటకు, మరియు వారు చేసుకొనే ఎంపికల ద్వారా ఆ దిశ ప్రభావితం చేయబడుతుంది అని ప్రజలకు తెలుపుటకు ప్రవక్తలు ఈ రకమైన షరతులను సూచిస్తారు.

## షరతులు లేని ప్రవచనములు

సంకల్పం యొక్క అక్షంలోని రెండవ బిందువు షరతులు లేని ప్రవచనములలో కనిపిస్తుంది. ఈ వాక్యభాగములు భవిష్యత్తును గూర్చి సులభమైన ప్రకటనలుగా ఉన్నాయి. వీటిలో ఎటువంటి నిర్దిష్టమైన షరతులు ఉండవు. అలాటి సందర్భములలో, భవిష్యత్తును ఒక నిర్దిష్ట దిశలో నడిపించుటకు దేవుడు మరింత సంకల్పం కలిగియున్నాడని ప్రవక్తలు వెల్లడించారు. అయితే, మానవులు అధికముగా స్పందించుట ద్వారా సంఘటనలు మరొక దిశను తీసుకునే అవకాశం ఉందని ఈ ప్రవచనముల యొక్క ఫలితముల ద్వారా మనకు తెలుస్తుంది. ఇటువంటి ప్రవచనమును గూర్చిన ఒక ఉదాహరణను ఇప్పటికే మనం చూశాము. యోనా 3:4లో ప్రవక్త ఈ మాటలు చెప్పాడు:

> ఇక నలువది దినములకు నీనెవె పట్టణము నాశనమగును (యోనా 3:4).

ఈ ప్రవచనములో ఎటువంటి నిర్దిష్ట షరతులు లేవు, మరియు దేవుడు పట్టణమును నాశనము చేయుటకు నిర్ణయించుకున్నాడు అని ప్రవక్తయైన యోనా స్పష్టం చేశాడు. అయినప్పటికీ, నీనెవె పట్టణములోని ప్రాముఖ్యమైన మరియు విస్తృతమైన పశ్చాత్తాపము కలుగుటవలన, దేవుడు ఆ పట్టణముకు విరోధముగా ఇచ్చిన తీర్పును ఆలస్యం చేశాడు.

నిబంధనా ఆశీర్వాదములు షరతులు లేని ప్రవచనముల రూపములో కూడా కనిపిస్తాయి. హగ్గయి 2:21-23లో జెరుబ్బాబెలుకు హగ్గయి ఏమి చెప్పాడో వినండి:

> యూదాదేశపు అధికారియగు జెరుబ్బాబెలుతో ఇట్లనుము ఆకాశమును భూమిని నేను కంపింపజేయుచున్నాను. రాజ్యముల సింహాసనములను నేను క్రింద పడవేతును; అన్యజనుల రాజ్యములకు కలిగిన బలమును నాశనము చేతును; ... నా సేవకుడవును షయల్తీయేలు కుమారుడవునైన జెరుబ్బాబెలూ, నేను నిన్ను ఏర్పరచుకొనియున్నాను గనుక ఆ దినమున నేను నిన్ను తీసికొని ముద్ర యుంగరముగా చేతును; ఇదే సైన్యములకు అధిపతియగు యెహోవా వాక్కు (హగ్గయి 2:21-23).

ఇశ్రాయేలు చుట్టూనున్న రాజ్యములను నాశనము చేసి, ఆయన ప్రజల మీద జెరుబ్బాబెలును రాజుగా నియమించడానికి దేవుడు సిద్ధంగా ఉన్నాడని ఈ వాక్యభాగం స్పష్టం చేస్తుంది.

ఇక్కడ షరతులు ఏమి లేవు, అయినను ఇది ఎన్నడూ జరుగలేదని మనకు తెలుసు. జెరుబ్బాబెలు దేవుని ప్రజల మీద రాజుగా నియమించబడలేదు మరియు ఇశ్రాయేలు చుట్టూ ఉన్న రాజ్యములు నాశనము చేయబడలేదు. ఎందుకు ఇలా జరిగింది? ఎందుకంటే చెర తరువాత సమాజము

యెహోవాకు విధేయత చూపుటలో విఫలమయ్యింది మరియు ఈ మానవ అనిశ్చితము ప్రవచనము నెరవేర్చబడిన విధానము మీద ప్రభావం చూపింది.

## ధృవీకరించబడిన ప్రవచనములు

దేవుడు అనేక సాధ్యతలను అనుసరించుటకు సముఖత కలిగియున్నాడని కొన్ని ప్రవచనములు సూచించుచున్నప్పటికీ, సంఘటనలను నిర్దిష్ట దిశలో జరిగించడానికి దేవుడు ఒక ఉన్నతమైన సంకల్పమును కలిగియున్నాడని కూడా ప్రవక్తలు కొన్నిసార్లు సూచిస్తారు. దేవుడు కొన్ని ప్రవచనములను ధృవీకరించాడు అని చూపించుట ద్వారా వారు దేవుని యొక్క ఉన్నతమైన సంకల్పమును తెలియజేశారు. పాత నిబంధన ప్రవక్తలు తమ ప్రవచనములను ధృవీకరించడానికి రెండు ప్రాథమిక మార్గములు ఉన్నాయి: మొదటిగా, దేవుడు తన ఉన్నతమైన సంకల్పమును పదాలతో సూచించాడు; రెండవదిగా, ఆయన తన ఉద్దేశ్యములను సూచనల ద్వారా చూపించాడు. దేవుడు ఆయన ప్రజలకు ఇచ్చిన మౌఖిక ధృవీకరణలను మొదటిగా చూద్దాము.

### పదాలు

మౌఖిక ధృవీకరణను గూర్చిన ఒక ఉత్తమ ఉదాహరణ ఆమోసు గ్రంథము మొదటి అధ్యాయములో కనిపిస్తుంది. ప్రవక్తయైన ఆమోసు తన గ్రంథములోని 1:3లో ఏమి చెప్పాడో వినండి:

> దమస్కు మూడు సార్లు నాలుగు సార్లు చేసిన దోషములనుబట్టి నేను తప్పకుండ దాని శిక్షింతును (ఆమోసు 1:3).

"నేను తప్పకుండ దాని శిక్షింతును" అను మాటలు ఈ అధ్యాయములోని ప్రవచనముల యొక్క పునరావృత లక్షణమును ఏర్పరుస్తాయి. దేవుడు ఈ మాటలను పదే పదే ఎందుకు చెప్పాడు? ఈ తీర్పులను కొనసాగించడానికి తనకు ఉన్నతమైన సంకల్పం ఉందని ఆయన చెప్పాలనుకున్నాడు. అయితే ఈ ధృవీకరణ దేవుని తీర్పును నివారించడానికి వేరే మార్గం లేదు అని అర్థమిస్తుందా? హృదయపూర్వకమైన మరియు సంపూర్ణమైన పశ్చాత్తాపము దేవుని కోపమును చల్లార్చుతుంది అని ప్రవక్త చాలా స్పష్టంగా చెప్పాడు. ఆమోసు 5:4 మరియు 6లో దేవుడు యేమని చెప్పాడో వినండి:

> ఇశ్రాయేలీయులతో యెహోవా సెలవిచ్చునదేమనగా నన్నాశ్రయించుడి, నన్నాశ్రయించినయెడల మీరు బ్రదుకుదురు ... యెహోవాను ఆశ్రయించుడి; అప్పుడు మీరు బ్రదుకుదురు, ఆశ్రయింపనియెడల ... అగ్నిపడినట్లు ఆయన యోసేపు సంతతిమీద పడి దాని నాశనముచేయును (ఆమోసు 5:4, 6).

ఇశ్రాయేలు మీదికి కూడా దేవుడు తన అగ్నిని పంపించడానికి నిశ్చయించుకున్నాడు అని ఆమోసు 1 మరియు 2 అధ్యాయములు తెలియజేస్తున్నాయి, అయితే హృదయపూర్వకమైన మరియు విస్తృతమైన పశ్చాత్తాపము దేవుని ఉగ్రత మీద ప్రభావము చూపుతుంది అని ఈ వాక్యభాగం స్పష్టం చేస్తుంది. పాత నిబంధన గ్రంథములోని అనేక వాక్యభాగములు ఈ విధంగానే ఉన్నాయి. ప్రవక్తలు ఆయన యొక్క సంకల్పమును ధృవీకరించడానికి పదములను ఉపయోగించుట ద్వారా దేవుడు ఎంత

ఉన్నతమైన సంకల్పమును కలిగియున్నాడో సూచించారు. తమ శ్రోతలు దేవునిని ఆసక్తిగా వెదకాలని మరియు హృదయపూర్వకముగా పశ్చాత్తాపము పొందునట్లు వారిని ప్రోత్సహించాలని వారు ఈ విధంగా చేశారు.

### సూచనలు

ప్రవక్తలు దేవుని ఉన్నతమైన సంకల్పము యొక్క మౌఖిక ధృవీకరణలను మాత్రమే జోడించలేదు గాని, వారి ప్రవచనములను సూచనలతో జోడించుట ద్వారా దైవిక ఉద్దేశమును ఉన్నత స్థాయిలో వెల్లడించారు. పాత నిబంధన అంతటా, దేవుడు కొన్ని పనులు చేయడానికి ఉన్నతమైన సంకల్పం కలిగియున్నాడు అని స్పష్టం చేయడానికి ప్రవక్తలు వివిధ సూచనలను మరియు సూచక క్రియలను చేసినట్లు మనం చూస్తాము. ప్రవచనముతో పాటుగా సూచన ఉన్నప్పుడు, ప్రవక్త ప్రవచించిన దానిని జరిగించడానికి దేవుడు గట్టి సంకల్పం కలిగియున్నాడు అని అది స్పష్టం చేస్తుంది.

దీనిని గూర్చిన ఒక ఉత్తమమైన ఉదాహరణ యెషయా 7లో కనిపిస్తుంది. సిరియనులు మరియు ఇశ్రాయేలీయులు తన మీదికి దండెత్తి వస్తున్నప్పుడు దేవునిని విశ్వసించాలని యెషయా ఆహాజును హెచ్చరించిన విషయమును మీరు జ్ఞాపకము ఉంచుకొనండి. అయితే ఆహాజు తిరస్కరించినప్పుడు, 7:11లో దేవుడు అతనితో ఈ మాటలు చెప్పాడు:

> నీ దేవుడైన యెహోవావలన సూచన నడుగుము. అది పాతాళమంత లోతైనను సరే ఊర్ధ్వలోకమంత ఎత్తయినను సరే (యెషయా 7:11).

దేవుడు తనను చూసుకుంటాడని యెషయా రాజుకు హామీ ఇచ్చాడు, కాని ఆహాజు కపటత్వంలో నిరాకరించాడు. కాబట్టి దేవుడు ఒక సూచన ఇచ్చాడు, అయితే అది రక్షణను గూర్చిన సూచనగా కాకుండా నాశనమును గూర్చిన సూచనగా మారింది.

కాబట్టి ప్రవక్తలు షరతులతో కూడిన ప్రవచనములను మరియు షరతులు లేని ప్రవచనములను మాత్రమే కాకుండా, వారు తమ ప్రవచనములను మాటలు మరియు సూచనలతో ధృవీకరిస్తూ, ఒక నిర్దిష్ట దిశలో వెళ్లడానికి దేవునికి ఉన్నతమైన సంకల్పం ఉందని వెల్లడించారు.

## ప్రమాణపూర్వకమైన ప్రవచనములు

నాలుగవ రకమైన ప్రవచనము దేవుడు ప్రవక్తల ద్వారా చెప్పినదానిని పూర్తి చేయడానికి నిర్ణయించుకున్నాడు అని అనిశ్చితమైన విధముగా వెల్లడిచేస్తుంది. ఇటువంటి ప్రవచనములు దైవ నిబంధనల రూపమును సంతరించుకుంటాయి.

ప్రవక్తల మాటలు చాలాసార్లు దేవుడు ఏదో చేస్తానని నిబంధన చేశాడు అని ప్రకటిస్తాయి. ఉదాహరణకు, ఆమోసు 4:2లో షోమ్రోను పట్టణములోని ధనిక స్త్రీలను శత్రువులు పట్టుకొనిపోతారు అని దేవుడు ప్రమాణము చేశాడు. ప్రవక్త దానిని ఎలా చెప్పాడో వినండి:

> యెహోవా తన పరిశుద్ధత తోడని చేసిన ప్రమాణమేదనగా: ఒక కాలము వచ్చుచున్నది, అప్పుడు శత్రువులు మిమ్మును కొంకులచేతను, మీలో శేషించినవారిని గాలముల చేతను పట్టుకొని లాగుదురు (ఆమోసు 4:2).



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

మరొక ప్రమాణ సూత్రము యెహెజ్కేలు 5:11లో కనిపిస్తుంది. అక్కడ మనము ఈ మాటలను చదువుతాము:

> నీ హేయదేవతలన్నిటి ... చేత నా పరిశుద్ధస్థలమును అపవిత్ర పరచితివి గనుక ... నేను నిన్ను క్షీణింపజేసెదనని నా జీవముతోడు ప్రమాణము చేయుచున్నాను; ఇదే ప్రభువగు యెహోవా వాక్కు (యెహెజ్కేలు 5:11).

దేవుడు ప్రవక్తల ప్రవచనముతో పాటుగా ప్రమాణమును జతచేసినప్పుడు, అది ఆ ప్రవచనమును నిబంధనా నిశ్చయత స్థాయికి పెంచుతుంది. ఆయన చేయుదునని చెప్పినదంతయు చేస్తానని దేవుడు తన నిబంధనలలో ప్రమాణం చేశాడు. ప్రవక్తలు ప్రవచనమునకు దైవ ప్రమాణమును జతచేసినప్పుడు, దేవుడు తాను చెప్పినదానిని కొనసాగించడానికి ఖచ్చితంగా నిర్ణయించుకున్నాడు అని ఇది సూచిస్తుంది.

ఇప్పుడు, ప్రమాణముల ద్వారా ధృవీకరించబడిన ప్రవచనములను అమలు చేయడానికి దేవుడు పూర్తిగా నిర్ణయించుకున్నాడు అనేది వాస్తవముగా ఉండగా, కొన్ని విధాలుగా చారిత్రిక అనిశ్చితములు జోక్యము చేసుకొనిన కొన్ని సందర్భములలో స్పందించడానికి దేవుడు స్వంతంత్రుడై ఉన్నాడు అని కూడా మనం చూడాలి. తరచుగా "ఎప్పుడు" అనే ప్రశ్న మాత్రం మిగిలిపోతుంది; ప్రవచనము విన్న ప్రజల యొక్క స్పందన ద్వారా సమయం ప్రభావితమవుతుంది. రెండవదిగా, ప్రవచనమును ఎవరు అనుభవిస్తారు అను విషయము మాత్రం ఎల్లప్పుడు మార్పుచెందదగిన విషయముగా ఉంటుంది. మరియు మూడవదిగా, ప్రవచనము ఏ మాధ్యమము ద్వారా జరుగుతుంది అను విషయము మాత్రం తరచుగా పేర్కొనబడదు. మరియు నాల్గవదిగా, ప్రవచనము ఎంత మేరకు నెరవేర్చబడుతుంది అను విషయము ఎల్లప్పుడు బాహాటమైన ప్రశ్నగానే ఉంటుంది.

ఆమోసు 6:7-8లో కనిపించే తీర్పును గూర్చిన ప్రమాణమును గమనించండి:

> యాకోబు సంతతివారికున్న గర్వము నాకసహ్యము; వారి నగరులకు నేను విరోధినైతిని గనుక వారి పట్టణములను వాటిలోని సమస్తమును శత్రువుల వశము చేసెదనని ప్రభువైన యెహోవా తనతోడని ప్రమాణము చేసెను; ఇదే దేవుడును సైన్యములకధిపతియునగు యెహోవా వాక్కు (ఆమోసు 6:7-8).

ఇంతకుముందు తన పుస్తకములో ఆమోసు తప్పించుకొనే అవకాశము ఉన్నదని చెప్పినప్పటికీ, ఈ సమయంలో ఆమోసు షోమ్రోను పూర్తిగా నాశనము చేయబడుతుందని స్పష్టముగా ప్రకటించాడు. అయినప్పటికీ, ఈ ప్రమాణం బాహాటముగా ఉన్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వదు, ఉదాహరణకు ఎప్పుడు? అను ప్రశ్న. ఈ నాశనము వెంటనే జరుగుతుందా, లేదా వాయిదా వేయబడుతుందా? ఎవరు లేదా ఏ ప్రజలు నాశనము చేయబడతారు, చెరపట్టబడతారు, లేదా ఎవరు తప్పించుకుంటారు, అనేది ఇంకా బాహాటముగానే ఉంది, మరియు ఏ మాధ్యమము ద్వారా దేవుడు నాశనము చేస్తాడు అను విషయము కూడా స్పష్టం చేయబడలేదు. వాస్తవంగా చెప్పాలంటే, ఎంత మేరకు ఈ నాశనము జరుగుతుంది అనేది కూడా బాహాటముగానే ఉంది. ఇశ్రాయేలీయులు ఇచ్చే స్పందనల వెలుగులో ఈ ప్రశ్నలకు జవాబు ఇవ్వవలసి ఉంది. వారి ప్రార్థనలు మరియు పశ్చాత్తాపము, వారి తిరుగుబాటు మరియు ధిక్కరణ, ఈ ప్రవచనము యొక్క నెరవేర్పులో విపరీతమైన వ్యత్యాసములను కలిగిస్తాయి.

ఆశీర్వాదములను గూర్చిన దైవ ప్రమాణములో కూడా ఇటువంటిదే కనిపిస్తుంది. ఉదాహరణకు, యెషయా 62:8లో చెర నుండి తిరిగి వచ్చిన వారితో చేయబడిన ఈ ప్రమాణమును మనం చదువుతాము:

> **తన దక్షిణ హస్తము తోడనియు బాహుబలము తోడనియు యెహోవా ఈలాగున ప్రమాణము చేసెను: నిశ్చయముగా ఇకను నీ ధాన్యమును నీ శత్రువులకు ఆహారముగా నేనియ్యను నీవు ప్రయాసపడి తీసిన ద్రాక్షారసమును అన్యులు త్రాగరు (యెషయా 62:8).**

దేవుడు తన ప్రజలను వాగ్దాన భూమికి తిరిగి రప్పించెదను అని ప్రమాణము చేసినట్లు ఈ వాఖ్యభాగము స్పష్టం చేస్తుంది, కాబట్టి ఈ ప్రవచనము జరుగుతుందని ప్రజలు నిశ్చయతతో ఉంటారు. అయినను, జవాబు ఇవ్వబడని ప్రశ్నలు మిగిలి ఉన్నాయి. దేవుడు దీనిని ఎప్పుడు చేస్తాడు? వాగ్దాన భూమికి ఎవరిని తీసుకువస్తాడు? ఈ పునరుద్ధరణను ఏ మాధ్యమము ద్వార నెరవేర్చుతాడు? ఈ పునరుద్ధరణ ఎంత మేరకు జరుగుతుంది? ప్రమాణాలతో ఉన్న ప్రవచనాలలో, ఈ రకమైన ప్రశ్నలు ఎల్లప్పుడూ బాహాటముగానే ఉంటాయి.

కాబట్టి, భవిష్యత్తును ఒక మార్గంలో లేదా మరొక మార్గంలో మార్గనిర్దేశము చేయుటకు దేవుడు విభిన్న సంకల్పములను కలిగియున్నాడని పాత నిబంధన ప్రవక్తలు సూచించుటను మనం చూస్తాము. కొన్ని ప్రవచనములు విస్తృతముగా బాహాటమై ఉన్నట్లు అవి స్పష్టంగా సూచిస్తాయి. మరికొన్ని ఈ విషయంలో అవ్యక్తంగా ఉంటాయి. ఇంకొన్ని ప్రవచనములు మాటలు మరియు సూచనల ద్వారా ధృవీకరించబడతాయి. మరియు, చివరిగా, కొన్ని ప్రవచనములు దైవ ప్రమాణముల ద్వారా ధృవీకరించబడతాయి.

పాత నిబంధన ప్రవచన గ్రంథములను మనము అధ్యయనము చేయుచుండగా, ప్రవచనములు మరియు చారిత్రిక అనిశ్చితముల యొక్క జోక్యముకు మధ్య సంబంధమును జ్ఞాపకం చేసుకోవడం ఎల్లప్పుడు ప్రాముఖ్యమైన విషయముగా ఉంది. ప్రవక్తలు చెప్పినదానిని కొనసాగించడానికి దేవునికి వివిధ స్థాయిల సంకల్పం ఉంది, మరియు ఈ వివిధ స్థాయిల సంకల్పమును మనం జ్ఞాపకం చేసుకోకపోతే గొప్ప నష్టమును ఎదుర్కొనవలసియుంటుంది.

## ప్రవచనముల యొక్క లక్ష్యాలు

ప్రవక్తలు తమ ప్రవచనముల యొక్క ఖచ్చితత్వము ఎలా అర్థం చేసుకున్నారో ఇప్పటివరకు మనం చూశాము గనుక, ప్రవచనాత్మక ప్రవచనముల యొక్క లక్ష్యాలను గ్రహించే స్థితిలో మనం ఉన్నాము. ప్రవక్తలు ప్రవచనములను ఎందుకు చెప్పారు? వారి ఉద్దేశ్యములు ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటే, మొదటిగా, ప్రవచనముల యొక్క ఉద్దేశ్యమును గూర్చిన సుప్రసిద్ధ దృక్కోణములను మనము పరిశీలించాలి, మరియు రెండవదిగా, సరియైన దృక్కోణములను పరిశీలించాలి.

## సుప్రసిద్ధ దృక్కోణములు

పాత నిబంధన ప్రవచనముల యొక్క ఉద్దేశ్యమును గూర్చి విస్తృతముగా ప్రబలిన ఒక అపార్థమును మొదటిగా చూద్దాము. పాత నిబంధన గ్రంథములోని ప్రవచనముల యొక్క ఉద్దేశ్యమును గూర్చిన ఒక ఆధిపత్య దృక్కోణం ఉంది అంటే, దానిని "పురోసూచన" అను పదములో సంగ్రహించవచ్చు. మనకు తెలిసినట్లుగా, వైద్య నిపుణులు భవిష్యత్ పరిణామము గూర్చి మాట్లాడేటప్పుడు, వారు అనారోగ్యము లేక పరిస్థితి యొక్క ఫలితమును గూర్చి ఏమనుకుంటారో మనకు చెబుతారు. అనేక విధాలుగా, చాలామంది క్రైస్తవులు ప్రవక్తలను ఈ విధంగానే అర్థం చేసుకున్నారు. ప్రవక్తలు కేవలం భవిష్యత్తును గూర్చి మాత్రమే చెబుతారు అని వారు అనుకుంటారు; రాబోవు విషయాలను ముందుగా వారు సూచిస్తారు. ఇప్పుడు, ఈ దృక్కోణములో వాస్తవికత అనే విషయము ఉంది. ఏ సమయములోనైనా దేవుడు ఈ మార్గంలో లేదా ఆ మార్గంలో వెళ్లడానికి నిర్ణయించుకున్నాడు అని ప్రవక్తలు వెల్లడిచేశారు. అయినను చారిత్రిక అనిశ్చితముల జోక్యము ప్రవచనములు నెరవేర్చబడు విధానము మీద ముఖ్యమైన ప్రభావము చూపుతుందని మనం ఎల్లప్పుడు జ్ఞాపకం చేసుకోవాలి.

ప్రవచనమును గూర్చిన ఈ సుప్రసిద్ధ ఆలోచన వెనుక ఒక వాక్యభాగము ఉంది, అది ద్వితీయోపదేశకాండము 18:20-22. ఈ వాక్యభాగములో, ఒక ప్రవక్త నిజమైన ప్రవక్తా లేదా అబద్ధ ప్రవక్తా అని నిర్ణయించు ఒక ప్రమాణమును ఇశ్రాయేలుకు మోషే ప్రకటించాడు. 21వ వచనము ఇశ్రాయేలీయుల పక్షమున మోషే అడిగిన ప్రశ్నయైయున్నది:

> ఏదొకమాట యెహోవా చెప్పినది కాదని మేమెట్లు తెలిసికొనగలమని మీరనుకొనిన యెడల (ద్వితీయోపదేశకాండము 18:21).

22వ వచనము ఈ ప్రశ్నకు జవాబిస్తుంది:

> ప్రవక్త యెహోవా నామమున చెప్పినప్పుడు ఆ మాట జరుగక పోయిన యెడలను ఎన్నడును నెరవేరకపోయిన యెడలను అది యెహోవా చెప్పిన మాట కాదు, ఆ ప్రవక్త అహంకారముచేతనే దాని చెప్పెను గనుక దానికి భయపడవద్దు (ద్వితీయోపదేశకాండము 18:22).

ఈ వాక్యభాగము యొక్క విస్తృతమైన అపార్థము ఈ విధంగా ఉంది: యెహోవా యొక్క నిజమైన ప్రవక్త ఏదైనా చెప్పినప్పుడు, అది అతడు చెప్పినట్లు ఖచ్చితంగా జరిగి తీరాలి. అయితే నిజమైన ప్రవక్తను సరిగా గుర్తించడానికి మోషే పెట్టిన పరీక్షను అనువర్తించాలంటే, ఈ పాఠంలో ఇప్పటికే చూచిన దానిని మనం జ్ఞాపకం చేసుకోవాలి. ప్రవక్తల యొక్క మాటలను మనము అమర్యాదగా చూడకూడదు. ప్రవచనాత్మక ప్రవచనముల వెనుక ఉన్న ఉద్దేశాలను మనం గమనించాలి. ప్రవక్తలు మాట్లాడినప్పుడు, వారు ప్రవచించినది ఖచ్చితముగా వాస్తవము అనే అభిప్రాయమును ఇవ్వడానికి వారు ఉద్దేశించలేదు. మానవుని ప్రతిస్పందనలు ప్రవచనము యొక్క నెరవేర్పును ప్రభావితం చేస్తాయని, వారి మాటలు, కొన్నిసార్లు స్పష్టంగాను మరికొన్నిసార్లు అవ్యక్తంగాను వెల్లడించాయి. కాబట్టి, ప్రవక్తలను గూర్చి మోషే ఇచ్చిన పరీక్షను మనం అనువర్తించినప్పుడు, ప్రవక్తలు స్పష్టంగా ఏమి చెప్పారు అని మాత్రమే కాకుండా వారి ప్రవచనములకు ఎటువంటి అవ్యక్త పరిస్థితులు వర్తిస్తాయి అని కూడా మనం అడగాలి.

ప్రవచనము విషయంలో ఇది నిజమైయున్నది అని మోషే మరియు ఇశ్రాయేలుకు తెలుసు. కేవలము దైవ ప్రమాణములు మాత్రమే భవిష్యత్ సంఘటన యొక్క ఖచ్చితత్వమును పొందాయని వారికి తెలుసు. ప్రవక్తలు తీర్పును గూర్చి మాట్లాడినప్పుడు, వారు ఖచ్చితముగా తీర్పులోకి వెళతారు అని ప్రవక్తలు ఖండించలేదుగాని, తీర్పును గూర్చి హెచ్చరించారు అని వారికి తెలుసు. దైవికమైన ప్రమాణము చేయబడింది అని ప్రవక్తలు సూచించకపోతే తప్ప, వారు ఆశీర్వాదమును వాగ్దానం చేయలేదు గాని ఆశీర్వాదమును ప్రతిపాదించారు అని వారికి తెలుసు. ఈ సందర్భములలో, గణనీయమైన చారిత్రిక అనిశ్చితముల జోక్యము ద్వారా మోషే యొక్క పరీక్షలు అర్హత సాధించాలి. మరో మాటలో చెప్పాలంటే, కొన్ని ముఖ్యమైన మానవ ప్రతిచర్యలు ఈ ప్రక్రియను ప్రభావితం చేయనంతవరకు, మోషే పరీక్షలు సులభంగా వర్తిస్తాయి. లేదంటే, దేవుని ప్రతిస్పందన యొక్క సాధ్యతలను కూడా ప్రవచనములలో చేర్చాలి. ముఖ్యమైన చారిత్రిక అనిశ్చితములు జరిగాయా? అని శ్రోతలు ప్రశ్నించాలి. అవి జరిగితే, మోషే పరీక్షలను తగిన విధంగా సర్దుబాటు చేయాలి.

## సరియైన దృక్కోణములు

పురోసూచన ప్రవచనము యొక్క ప్రధాన లక్ష్యమైయున్నది అని చెప్పుట అపోహ అయినట్లయితే, ప్రవచనాత్మక ప్రవచనముల యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఏమిటి? సులభంగా చెప్పాలంటే, ప్రవక్తలు ప్రధానంగా వారి శ్రోతలను ప్రోత్సహించడానికి లేదా ఉత్తేజపరచుటకు భవిష్యత్తును గూర్చి మాట్లాడారు. మరొక విధంగా చెప్పాలంటే, భవిష్యత్తును గూర్చి తమ శ్రోతలకు చెప్పేవాటికంటే కూడా, శ్రోతలు తమ భవిష్యత్తును రూపొందించుకొనునట్లు వారిని ప్రోత్సాహపరచాలని ఉద్దేశించారు.

ప్రవచనాత్మక ప్రవచనములను గూర్చిన ఈ దృక్కోణమును అర్థం చేసుకొనుట, పాత నిబంధన విశ్వాసులు ప్రవక్తల ప్రవచనములకు ప్రతిస్పందించిన విధానమును చూచుటకు సహాయపడుతుంది. మొదటిగా, "ఎవరికి తెలుసు?" అనే ప్రతిచర్యను చూద్దాము; మరియు రెండవదిగా, "రెండింతల" ప్రతిచర్యను చూద్దాము. దేవుని ప్రజల యొక్క ఈ ప్రతిచర్యలు ప్రవచనాత్మక ప్రవచనముల యొక్క లక్ష్యమును మరింత స్పష్టంగా చూచుటకు మనకు సహాయపడతాయి.

### "ఎవరికి తెలుసు?" ప్రతిచర్య

మొదటిగా, "ఎవరికి తెలుసు?" అను ప్రతిచర్యను చూద్దాము. పాత నిబంధనలోని మూడు సందర్భములలో, ప్రజలు ప్రవచనములను వినినప్పుడు, మనకు వింతగా అనిపించే విధముగా వారు ప్రతిస్పందించారు. "సరే, భవిష్యత్తులో ఏమి జరుగుతుందో మాకు తెలుసు" అని చెప్పుటకు బదులుగా వారు "ఎవరికి తెలుసు?" లేదా హెబ్రీలో, *మి యోదెఅ* (מִי יוֹדֵעַ) అని జవాబిచ్చారు.

"ఎవరికి తెలుసు?" అను ఈ ప్రతిచర్య గమనించదగిన మూడు సందర్భములలో జరిగింది. మొదటిగా, దావీదు బత్షెబతో పాపము చేసిన విషయమును గూర్చి నాతాను అతనిని ఎదుర్కొనినప్పుడు, 2 సమూయేలు 12:14లో అతడు ఈ మాటలను చెప్పాడు:

> **అయితే ఈ కార్యము వలన యెహోవాను దూషించుటకు ఆయన శత్రువులకు నీవు గొప్ప హేతువు కలుగజేసితివి గనుక నీకు పుట్టిన బిడ్డ నిశ్చయముగా చచ్చును (2 సమూయేలు 12:14).**



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

దావీదు కుమారుడు చనిపోతాడు అని నాతాను ప్రవచించాడు, మనము చూచినట్లుగానే, అతడు చనిపోయాడు. అయితే నాతాను ఈ ప్రవచనమును చెప్పిన తరువాత, ఆ కుమారుడు చనిపోక ముందు తాను ఏమి ఆలోచించాడో దావీదు తరువాత తన న్యాయస్థానములో ఉన్న ప్రజలకు వివరించాడు. 2 సమూయేలు 12:22లో అతడు ఈ మాటలు చెప్పాడు:

> అతడుబిడ్డ ప్రాణముతో ఉన్నప్పుడు దేవుడు నాయందు కనికరించి వాని బ్రదికించునేమో యనుకొని నేను ఉపవాసముండి యేడ్చుచుంటిని. ఇప్పుడు చనిపోయెను గనుక నేనెందుకు ఉపవాసముండవలెను? (2 సమూయేలు 12:22).

ప్రవక్త మాటలను అనివార్యంగా అంగీకరించకుండా, ప్రార్థన మరియు పశ్చాత్తాపము ద్వారా ఈ ప్రవచనమును నివారించవచ్చు అని దావీదు ఆశించాడు. ఆ బిడ్డ ఎలాగైనా చనిపోయాడు కాబట్టి అతని కష్టము పనిచేయలేదు, అయితే దావీదు దృష్టి మాత్రం స్పష్టంగా ఉంది. కుమారుడు చనిపోయే వరకు, దావీదు నిరీక్షణ ఉంచాడు, “బ్రతికించునేమో?” అను నిరీక్షణ.

అదే విధంగా, తీర్పు రాబోతుంది అని ప్రవక్తయైన యోనా నీనెవె పట్టణమునకు ప్రకటించాడు. అతని పుస్తకములోని 3:4లో, ఈ ప్రవచనమును మనం చదువుతాము:

> ఇక నలువది దినములకు నీనెవె పట్టణము నాశనమగును (యోనా 3:4).

మరోసారి, ప్రవక్త యొక్క ప్రవచనమును నీనెవె పట్టణస్థులు అనివార్యంగా అంగీకరిస్తారు అని మనం ఊహించవచ్చు, కాని వారు అంగీకరించలేదు. బదులుగా, వారు దావీదు వలె స్పందించారు. యోనా 3:9లో నీనెవె రాజు ఇలా చెప్పాడు:

> జనులు మనఃపూర్వకముగా దేవుని వేడుకొనవలెను ఒకవేళ దేవుడు మనస్సు త్రిప్పుకొని పశ్చాత్తప్తుడై మనము లయముకాకుండ తన కోపాగ్ని చల్లార్చుకొనును (యోనా 3:9).

మూడవ సందర్భములో, ప్రవచనము యెడల అదే ప్రతిచర్య జరుగుతుంది. యోవేలు 2:1-11లో, యెరూషలేముకు వ్యతిరేకముగా భయంకరమైన తీర్పు వస్తుంది అని ప్రవక్త ప్రకటించాడు. అయినను తమ శ్రోతలు పశ్చాత్తాపపడి మరియు ఉపవాసము చేయాలని అతడు వారిని ప్రోత్సహించాడు. పశ్చాత్తాపడి ఉపవాసము చేయుమని అతను ఎందుకు చెప్పాడో 2:14లో స్పష్టమైంది. అక్కడ, మనము ఈ మాటలను చదువుతాము:

> ఒకవేళ ఆయన మనస్సు త్రిప్పుకొని పశ్చాత్తాపపడి (యోవేలు 2:14).

అతని ప్రవచనము పూర్తిగా నెరవేరనంతవరకు, ప్రజలు దేవుని క్షమాపణను కోరడం మంచిది అని యోవేలు నమ్మాడు, ఎందుకంటే దేవుడు ఆ చారిత్రిక అనిశ్చిత జోక్యముకు ఎలా స్పందిస్తాడో ఎవరికి తెలియదు.

"ఎవరికి తెలుసు" అను ప్రతిచర్యలు పాత నిబంధన విశ్వాసులను గూర్చి మనకు ఏమి బోధిస్తాయి. ప్రవచనములు తమ విధిని నిర్ధారిస్తాయని పాత నిబంధన విశ్వాసులు నమ్మలేదు. బదులుగా, చారిత్రిక అనిశ్చితములు – ప్రత్యేకముగా ప్రార్థనా అనిశ్చితము – యొక్క జోక్యము ప్రవచనములు నెరవేర్చబడు విధానము మీద ముఖ్యమైన ప్రభావం చూపే అవకాశం ఉందని వారు ఎల్లప్పుడు నమ్మారు.

## ద్వంద్వ ప్రతిచర్య

"ఎవరికి తెలుసు?" అను ప్రతిచర్య పాత నిబంధన ప్రవచనము యొక్క లక్ష్యమును గూర్చిన విస్తృత అవగాహనకు మనలను నడిపిస్తుంది. ప్రవక్తలు తమ ప్రవచనముల విషయములో ద్వంద్వ ప్రతిచర్యను ఆశించారు మరియు నిరీక్షించారు. ఒకవైపు, తీర్పు మరీ తీవ్రకరముగా లేకపోయినా అది జరుగుతుంది అని నిర్ధారించడానికి ఒక మార్గం ఉంది అని ప్రవక్తలకు తెలుసు. ఈ మార్గము ప్రవచన హెచ్చరికను విస్మరించి, దేవుని మీద తిరుగుబాటును కొనసాగించుట అయ్యున్నది. అదే సమయంలో, దేవుడు తన ప్రజల మీదికి నిబంధనా తీర్పును పంపించడానికి నిర్ణయించుకున్నాడు అని ప్రవక్తలు ప్రకటించినప్పుడు, తీర్పు తొలగిపోవునట్లు ప్రజలు దేవుని వైపు తిరగాలని వారు ఆశించారు. దేవుని తీర్పును తప్పించుకొనుటకు ఒకే ఒక మార్గం యెహోవాను నమ్మడం మరియు పశ్చాత్తాపపడడం. మరోవైపు, ప్రవక్తలు ఆశీర్వాదములను గూర్చిన దేవోక్తులను పలికినప్పుడు, తమ శ్రోతల యొక్క ప్రతిచర్యలను ప్రేరేపించాలని కూడా వారు ఆశించారు. దేవునికి వ్యతిరేకంగా చేసే స్పష్టమైన తిరుగుబాటు ప్రవచించబడిన ఆశీర్వాదములను తీసివేసి తీర్పుతో దానిని భర్తీ చేస్తుంది అని వారు నమ్మారు, అయితే నమ్మకముగా జీవిస్తే ఖచ్చితముగా ఆశీర్వాదములు వస్తాయని వారికి తెలుసు.

సులభంగా చెప్పాలంటే, తమ శ్రోతలు తీర్పు నుండి తప్పించుకొని తమ చర్యల ద్వారా దేవుని ఆశీర్వాదములను పొందుకొనుటకు వారిని ప్రోత్సహించునట్లు ప్రవక్తలు తమ ప్రవచనములను ఇచ్చారు. ఈ విధంగా, ప్రవచనముల యొక్క లక్ష్యము ప్రధమంగా రాబోయే దానిని ముందుగా తెలియపరచుట కాదుగాని దేవుని ప్రజలను ప్రభువు యొక్క పరిచర్యలో ఉత్తేజపరచుట అయ్యున్నది.

# ముగింపు

ప్రవచనముల యొక్క ఉద్దేశ్యములను గూర్చి నాలుగు అంశములను ఈ పాఠములో మనము చూశాము: మొదటిగా, చరిత్ర మీద దేవుని సార్వభౌమత్వమును, తరువాత ప్రవచనములు మరియు అనిశ్చితములు, మూడవదిగా, ప్రవచనముల యొక్క ధృవీకరణ, చివరిగా ప్రవచనముల యొక్క లక్ష్యములు. ఈ పాఠములో మనము పరిశీలించిన అంశములు పాత నిబంధన ప్రవచన గ్రంథములను అర్థము చేసుకొనుటకు ప్రాముఖ్యమైనవిగా ఉన్నాయి. పాత నిబంధన ప్రవక్తలు భవిష్యత్తులో జరగబోయే వాటిని గూర్చి ప్రజలు నేర్చుకోవాలనే ఉద్దేశముతో చరిత్రను గూర్చి ముందుగా మాట్లాడలేదు. దేవుని కనికరమును వెదకి తద్వారా తీర్పు నుండి తప్పించుకొని దేవుని ఆశీర్వాదములను వెదకునట్లు వారు

ప్రజలను ప్రోత్సాహపరచారు. పాత నిబంధన ప్రవచన గ్రంథములను మనము చదువుచుండగా, దేవుని ఆశీర్వాదములను వెదకి, ఆయన తీర్పు నుండి తప్పించుకొనుటకు మనము ఉత్తేజభరితులమై ఉండాలి.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి